కథ

పెవీలియన్

— జి మాధవరావు

'ప్రసాద్ ఆర్ యు ఓ.కె.?'

ప్రసాద్ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు అప్పటి భారత్ క్రికెట్ జట్టు కెప్టెన్ నిఖిల్

అందుకు ప్రసాద్ నిఖిల్ వంక ఎంతో కృతజ్ఞతగా చూశాడు.

ఇపుడు అతని ముఖంలో శరీరంలో జ్వలిస్తున్న జ్వరం తాలూకు నీరసంకన్నా, తాను ఏకంగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ స్టేడియంలో కొన్ని వేలమంది ఆహుతుల సమక్షంలో ఎంతో ఉత్కంఠ భరితంగా సాగుతున్న ఒకరోజు అంతర్జాతీయ క్రికెట్ పోటీలో పాల్గొనే అవకాశం కల్గినందుకు ఆనందం అరవిరిసిన కుసుమంలా ద్యోదకమౌతున్నది.

కృతజ్ఞత నిండిన కళ్లు నీళ్లు చిలకరించాయి.

పెవీలియన్ నుంచి ఆట జరిగే మైదాన మధ్యస్థలానికి వెళ్లబోయే ముందు, తనకు ఈ అవకాశమిచ్చిన నిఖిల్ పాదాలకు బరువెక్కిన గుండెల భక్తి భావంతో స్పృశించాడు ప్రసాద్.

తన కాళ్లకు నమస్కరించే ఉద్దేశంతో వంగిన ప్రసాద్ భుజాలను తన రెండు చేతులతో మెల్లిగా పట్టుకుని, అతడ్ని పైకిలేపి ప్రసాద్ ముఖంలోకి కొన్ని క్షణాలు గమనించాడు నిఖిల్

ఆరోజు ఉదయం తన రూంలోకి వచ్చిన ప్రసాద్‌తో జరిగిన సంభాషణ ఆ క్షణంలో కపిల్ మనోతెరపై సినిమాలా ప్రొజెక్ట్ చెయ్యబడింది.

'మై ఐ కమిన్ ప్లీజ్?' కపిల్ రూం దగ్గర నిలబడి అడిగాడు ప్రసాద్.

'ఎస్.. ఎస్.. కమిన్.. ప్లీజ్.. బి సీటెడ్' అంతకు ముందే ఎవరితోనో ముచ్చటిస్తున్న కపిల్, ప్రసాద్‌ను అంతగా పట్టించుకున్నట్లు లేదు. సాధారణ ధోరణిలో అన్నాడు.

అనంతరం నిఖిల్ ప్రసాద్ వైపు చూస్తూ.. 'ఎస్..?' అంటూ ఏమిటీ విషయం? అనేలా అభినయించాడు.

ప్రసాద్‌కు నిఖిల్ పరిచయం బొత్తిగా లేదని చెప్పాలి.

ఆంధ్రా క్రికెట్ టీంలో వరసగా సెంచరీలు కొట్టి, అధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఘనత కె.ఎస్.వి.ప్రసాద్‌కు వున్నప్పటికినీ, అది కనీసం 'ఏ' క్లాస్ మ్యాచ్ ఆడేందుకైనా అర్హత కాకపోవటం అతడ్ని ఎంతో నిరుత్సాహ పరిచింది.

అయితే ప్రసాద్‌కు ఆంధ్రా టీంలో ఒక ప్రావీణ్యంగల క్రికెటర్‌గా మంచిపేరు వుంది. అందుకు ప్రేక్షకుల ఆదరాభిమానాలే నిదర్శనం.

అయితే ఎంతటి కృషీవలునికైనా మరుక్షణమే సత్ఫలితాలు సానుకూల పడకపోవచ్చు. ఆలస్యంగానైనా చేజిక్కే మంచి అవకాశానికి ఆ అనుభవాలు సోపానాలు కావచ్చు.

ప్రసాద్ విషయంలో ఖచ్చితంగా అలాగే జరిగింది.,

ఎన్నో సంవత్సరాల కృషి క్రికెట్‌లో ప్రసాద్‌ను ఒక మంచి క్రికెటర్‌ను చేయగలిగిందేగానీ, అతని ధ్యేయమైన జాతీయ స్థాయి గుర్తింపును ఒనగూర్చలేకపోయింది.

అయితే అతడు ఎప్పుడూ ఈ మిషతో నిరుత్సాహానికి లోనుకాకుండా వుండేందుకు అతని స్నేహితురాలు ప్రణతి ప్రసాద్‌ను ఎప్పుడూ ప్రోత్సహిస్తూ వుంటుంది.

ప్రసాద్, ప్రణతి ఒక మంచి స్నేహానికి ప్రతిరూపాలు. ప్రసాద్‌లోని క్రీడాకారుడు కోటి కిరణాల దివాకరునిలా వినీలాంబరిలో విస్తరించేందుకు ఆమె ఇచ్చే ప్రోత్సాహం వెనుక ఒక తియ్యని ఆశ కూడా లేకపోలేదు.

'ఐహిక ఆకర్షణకు లోనుగాక, అంతర్గత సంగమమై, ఒక సారూప్య మెరుగని తీయని సుషుప్తావస్థని ఆకళింపు చేసుకొని, విశ్వ సమ్మోహితమై విరాజిల్లే తాదాత్మ్యతనే మనం ప్రేమ' అని అనుకుంటే అది వారికి నప్పిన చిరునామ అని చెప్పాలి.

ప్రేమకు పర్యవసానం ఒక చక్కని కాపురం అనుకుంటే ప్రసాద్‌లోని అకుంఠిత లక్ష్యం వారినొక్కటిచేసే ప్రక్రియకు విఘాతమైంది.

అతను అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి తెచ్చుకునే వరకు తమ ప్రేమను, ఏ దేవుని పాదాల వాలేందుకో లేక ఏ ముదిత సిగలో వొదిగేందుకో కొమ్మవీడని పువ్వులా నిరీక్షింపచేసింది వారిద్దరి సంకల్పం.

ఆ రోజు అనుకోకుండా ఎదురైంది ప్రసాద్‌కు.

క్రికెట్ ఆడే దేశాల మధ్య జరిగే ప్రపంచ కప్ పోటీలో వేరువేరు సమయాలలో విజయులైన ఇండియా, పాకిస్తాన్ ఆస్ట్రేలియా దేశాల మధ్య ముక్కోణపు పోటీ ఏర్పాటు చేయబడింది ఆస్ట్రేలియాలో.

పోటీలో ప్రతిదేశం తమ విపక్షంపై కనీసం రెండుసార్లు ఆడాల్సి వుంది. ఈ ఆటలో ఎవరైతే ఎక్కువసార్లు గెలుస్తారో వాళ్లు ఫైనల్స్‌లో ఆడాలి. అంటే ఫైనల్స్‌లో ఆడే దేశాలు రెండే అయివుంటాయి.

ఈ విధంగా భారత్ ఆస్ట్రేలియాపై గెలిచి ఒకసారి, పాకిస్తాన్ ఇరు దేశాలపై విజయం సాధించి ఫైనల్స్ చేరుకున్నాయి.

ఫైనల్స్ ఆడేందుకు జట్టులోని సభ్యుల మార్పిడి అవసరమని భారత్ క్రికెట్ బోర్డుఆశించింది.

అదే తడవుగా భారతదేశంలో ఫాంలోవున్న ఆటగాళ్ల కోసం ప్రతి జోనల్ లెవల్‌లోను అన్వేషణ యుద్ధ ప్రాతిపదికగా జరిగింది. అందులో ప్రముఖంగా కె.ఎస్.వి. ప్రసాద్ పేరు ప్రతినోటా నానటం అతని ప్రజ్ఞకు స్వావలంబన చేకూర్చింది.

అంతే ఎవరూ అనుకోని రీతిలో ఒకరోజు ప్రసాద్ ఇంటికి భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు ఢిల్లీ నుంచి టెలిగ్రాం వచ్చింది. అందులో వున్న అంశం, ప్రసాద్ వెంటనే ఆస్ట్రేలియాలోని భారత్ జట్టుతో కలిసి రెండు రోజుల్లో జరగబోవు ఫైనల్స్‌లో ఆడాల్సిందిగా వుంది.

ప్రసాద్ అచిరకాల వాంఛ ఇంద్రచాపంలా నింగిలో విస్తరించబోయే తరుణం ఆసన్నమైనందుకు అతని తల్లిదండ్రులు, బంధువులతోపాటు స్నేహితులు అతడ్ని వేనోళ్ల కొనియాడారు.

ముఖ్యంగా అతని ప్రియురాలు శ్రేయోభిలాషి అయిన ప్రణతి ఆనందం అనంతనింగి ప్రాకారాలకు ఎగబాకింది.

కాకతాళీయంగా అందిన ఈ పిలుపువల్ల ప్రసాద్ మొదట ఎంతో నిర్ఘాంతపోయాడు.

నిఖిల్, అడిగిన తీరు ప్రసాద్‌ను కాస్త ఇరకాటంలో పెట్టింది.

అయినా తప్పదు. ఇప్పుడు అతడు అలసత్వం చూపితే మళ్లీ అతనికి ఇటువంటి అవకాశం దొరకటం దుర్లభం.

ఇదే ఆలోచిస్తున్నాడు ప్రసాద్.

ప్రసాద్ మౌనం నిఖిల్‌కు కాస్త చిరాకు కలిగించింది. 'వాట్... మిస్టర్...క్యా బాత్‌హై?' నిర్లక్ష్యంగా చూస్తూ అన్నాడు.

ఇక ఉపేక్షిస్తే ఎటువంటి పరిణామం ఎదుర్కోవాల్సి వస్తుందోనని, తనకు ఆ రోజు ఉదయం నుంచి జ్వరంగావున్నదన్న సంగతి నిఖిల్‌కు చెప్పాడు.

నిఖిల్ ఎలా రియాక్ట్ అవుతాడన్నది ఇప్పుడు ప్రసాద్‌ను కలవర పెడుతున్న సమస్య.

అయితే తనకు వచ్చిన ఈ సదవకాశాన్ని చేజార్చుకోకూడదని ప్రసాద్ నిశ్చయించుకున్నాడు.

తను ఈ అవకాశం కోసం ఎన్ని ఏళ్లుగా ఎదురు చూసిందీ, తను క్రికెట్ కోసం ఎంత శ్రమించిందీ, తన అభిమానుల ప్రసంశలు, తన ఆట నైపుణ్యం కళ్లకు కట్టినట్టుగా వివరించాడు నిఖిల్‌కు

నిఖిల్ మౌనంగా వింటున్నాడు.

ప్రసాద్ ఎంతో ఉద్వేగంగా చెప్తున్నాడు.

అతని కళ్లు నీళ్లతో నిండిపోయాయి. ఒళ్లు చెమటలు పడుతోంది. శరీరంలో శక్తి నిస్సత్తువవుతుంటే గొంతుల్లో ప్రతిమాట రెండుసార్లు దొర్లింది. అంతకు ముందు అనేక మంది ప్రేక్షకుల సమక్షంలో నీరాజనాలందుకున్న ప్రసాదేనా ఇతడు అనే విధంగా ప్రవర్తిస్తున్నాడు.

కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ, తన భవిష్యత్‌కు 'నో' అనే ఒక్క మాటతో ముగింపు రాయవద్దని వేడుకున్నాడు.

ఈ నేపథ్యంలో అతని అభినయం క్రికెట్ మైదానంలో చెయ్యి తిరిగిన బ్యాట్స్‌మెన్ అతి లాఘవంగా బంతుల్ని ప్రేక్షకుల్లోకి కొట్టే వైనంలా నిఖిల్ అనిపించింది.

ఇంకా నిఖిల్ మౌనంగా ప్రసాద్ చెప్తున్నది వింటున్నాడు.

ప్రసాద్‌లో ఆశ సన్నగిల్లింది. అతను చివరిసారిగా కపిల్ పాదాలపై పడి, ఉలుకు పలుకు లేకుండా వుండిపోయాడు.

అంతే నిఖిల్ ఒక నిర్ణయానికి ఎప్పుడో వచ్చేశాడు. కష్టమంటే చిన్నతనం నుంచి చవిచూసిన నిఖిల్‌కు ప్రసాద్ అభ్యర్థనలోని ఆక్రందన అర్థమైంది. అదిచాలు. దేశం ఎటువంటి విపత్కర పరిస్థితికి దిగజారినా అందుకు బాధ్యత తనదేగాని, ప్రసాద్‌ది కాదు అని నిర్ణయించుకున్నాడు.

మెడికల్ ఎగ్జామినర్‌ను ఎలాగైనా కన్విన్స్‌చేసి ప్రసాద్‌కు అవకాశం కల్పించ దలిచాడు నిఖిల్

ఆట మొదలైంది.

టాస్ పాకిస్తాన్ గెలుచుకుంది.

బ్యాటింగ్ సెలెక్ట్ చేసుకుంది పాకిస్తాన్ జట్టు.

అయితే గంభీర చిరునవ్వు నిఖిల్ పెదవులపై నుంచి ప్రతి ఆటగాణ్ని పలకరించింది. అదే వారికి అభయ ప్రదాతమైనది.

కానీ ప్రసాద్ స్థానంలో మరో ఎగ్స్ట్రా ఫీల్డర్ ఆట మైదానంలోకి వచ్చాడు.

పాకిస్తాన్ ఏడు వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసి భారత్‌కు గట్టి పోటీ ఇచ్చింది.

లంచ్ బ్రేక్ తర్వాత భారత్ జట్టు బ్యాటింగ్ ప్రారంభించింది. అయితే ఆరు వికెట్ల నష్టానికి కేవలం 90 పరుగులు చేయగలగటం జట్టులోని ప్రతి ఒక్కరినే కాదు భారత్ విజయం కోరుకునే ఆస్ట్రేలియా ప్రేక్షకులను కూడా ఎంతో నిరుత్సాహపరచింది.

చివరకు కెప్టెన్ కపిల్ కూడా 45 పరుగులకే నేలకు వొరిగాడు.

ఏడో స్థానం ప్రసాద్.

తన వంతు రాగానే ప్రసాద్ బ్యాట్ పుచ్చుకొని పెవీలియన్ నుంచి వెళ్ళే ముందు స్తబ్దంగా వున్న నిఖిల్‌దగ్గరకు వెళ్ళాడు.

నిఖిల్ దీవెనలు అందుకునే సమయంలో ప్రసాద్ శరీరంలోని జ్వరం 103 డిగ్రీలు వుంటుంది.

అయినా అతనిలోని దృఢ విశ్వాసం ఏ మాత్రం తొణకలేదు. పెవీలియన్ నుంచి పిచ్ వైపునకు ప్రసాద్ నడుస్తుంటే ఆస్ట్రేలియా ప్రేక్షకులు కొత్తగా ఈ జట్టులో చేరిన అతనిపట్ల ముభావంగా వుండిపోయారు.

అయితే మైదానం మొత్తం నిశ్శబ్దంగా వుండటం ప్రసాద్‌కు కాస్త ఇబ్బందిగా తోచింది.

కానీ అతడ్ని ఇవేవీ ప్రలోభించలేక పోయాయి.

అతనికి ఇప్పుడు కనిపిస్తుంది కేవలం బౌలర్ చేతిలోని బంతి తప్ప మరేమీ కాదు.

అప్పటికే నాలుగు వికెట్లు అవలీలగా తీసుకున్న పాక్ బౌలర్ మళ్ళీ బంతిని విసిరాడు పాత ధోరణిలోనే. అయితే బంతి ప్రసాద్ కొట్టాడో, లేదో తెలీదు.

అంతా నిశ్శబ్దం.

అంపైర్లు బంతికోసం వాకబు-

అంతటా రేగిన కలకలం అప్పటివరకు స్తబ్దంగా వున్న నిఖిల్‌తో ఉత్సాహాన్ని రేకెత్తించింది.

చావుకు సామీప్యంలో వున్న రోగి క్కూడా బ్రతుకుపట్ల గల ఆశ వెయ్యేనుగుల బలాన్నిస్తుంది.

కొద్దిసేపటికి తెలిసింది, బంతి గ్రౌండ్ దాటిపోయిందని - మరో కొత్త బంతి అందుకున్నాడు బౌలర్.

ప్రసాద్‌కు మళ్ళీ బంతే కనిపిస్తుంది. అయితే ఈసారి ప్రేక్షకుల్లో ఉత్సాహం పెరిగింది.

మళ్ళీ బంతి బౌండరీకి పరుగు. దాని వెనుకే రన్నర్. ఆపై అంపైర్ నాలుగు కొట్టినట్లు చేతిని ఇటు అటు ఊపాడు.

అలా బంతి గాలిలో ఎగురుతూనే వుంది. అంపైర్ చెయ్యి అతి నాజూగ్గా ఆరుకి, నాలుగుకి సంకేతం ఇస్తూనే వుంది.

ఇప్పటి ప్రసాద్ ఆటతీరు చూస్తే పద్మవ్యూహంలో అప్పటి అభిమన్యుని సమర శౌర్య ప్రదర్శన ఊహకు వస్తుంది కాస్త రసాభిరుచి గలవారికి.

ప్రసాద్‌తోపాటు ఆడే వికెట్లు పాక్ ప్రతీకార జ్వాలకు తాళలేక పోయాయి.

అయినప్పటికీ ప్రసాద్ చివరి వికెట్ ఆసరాతో 169 పరుగులు చేసి అజేయుడై భారత్ గెలుపును ఒక కమ్మని కలలా ప్రపంచమంతా చెప్పుకునేలా చివరి బంతిని విశ్వాంతరాళంలో నిలిచిపోయేలా ఒక్క బాదు బాదాడు.

అంతే స్టేడియం అంతా మారుమ్రోగింది. ఎక్కడ చూసినా కోలాహలం. ప్రపంచం యావత్తు వున్న టెలివిజన్ల తెరపై భారత్ విజయ పతాకం రెపరెపలాడింది.

అన్ని దేశాలకు ఈ విజయవార్త మారుమ్రోగేలా కామెంటేటర్లు బిగ్గరగా చెప్తున్నారు. అందులో ప్రతి వాక్యం ప్రసాద్ పేరు లేకుండా లేదు.

తన ప్రియుని ఖ్యాతి మింటి మేఘగర్జనలా భూనభోంతరాలు దద్దరిల్లేట్లు చేస్తుంటే తన ఇంట్లో ఒక బుల్లితెరపై అతని అపురూప ఆకారం కోసం కనురెప్పలు ఆర్పకుండా చూస్తుండి పోయింది ప్రణతి.

అంతలో ప్రేక్షకుల్లో నుంచి కొంతమంది మైదానం వైపు దూసుకు రావటం కనిపించింది.

అందులో ముందుగా వచ్చింది భారత్ కెప్టెన్ నిఖిల్ ప్రసాద్‌ను తన భుజాలపై ఎత్తుకుని అతడ్ని స్టేడియం నలుదిక్కులా తిప్పాడు.

అతడ్ని మిగిలిన జట్టు సభ్యులు అనుసరించారు.

అయితే ప్రసాద్ ఇదేమీ గమనించే స్థితిలో లేడు. ఎందుకంటే అతను ఎప్పుడో స్పృహ కోల్పోయాడు నిఖిల్ బలమైన భుజాలపై తన తలపెట్టి తెలియని మైకంతో నిర్వీర్యంగా వాలిపోయాడు.

ప్రసాద్‌ను భుజాలపై వేసుకుని పెవీలియన్ వైపు పరుగుతీశాడు.

అంతా నిష్క్రమించారు. ఇప్పుడు ఆ మైదానంలో ఇంతక్రితమే వినిపించిన జయకేతనాలు లేవు. జనవాహినీ లేదు.

అయితే ఆ పెవీలియన్ మాత్రం మరో ప్రసాద్‌లాంటి ఆటగాని కోసం ఎంతో ఆర్ద్రంగా, ఆశగా... జలపుష్పాల్లాంటి కళ్ళతో నిరీక్షిస్తూ... వుండిపోయింది స్వపర భేదాల్తెలియని భూమి కదా అది.